# గతజన్మలు

నేను ఆధ్యాత్మికతలోకి రాక ముందు మన జీవితంలో మనకు వస్తున్న సమస్యలకు కారణం ఏమిటి అని ఎవరిని అడిగినా, అందరూ గతజన్మలో చేసిన పాపం, కర్మ, తలరాత, మనమేం చేయలేం, మన జీవితం మన చేతుల్లో లేదు అని చెబుతూ వచ్చారు.

నేను ధ్యానంలోకి వచ్చిన తర్వాత ఇతరుల ద్వారా నాకు తెలిసిన విషయం ఏమిటంటే, గతం అవగతమైతే విగతం అవుతుందని. అంటే గతజన్మ చూసుకుంటే ప్రస్తుత-జన్మలో ఉన్న సమస్య పోతుందని. ఇలా చేయడం వలన కొందరికి తాత్కాలికంగా ఉపశమనం లభించినప్పటికీ, మళ్ళీ సమస్య తిరిగి వారి జీవితంలో రావడాన్ని గమనించాను. అలాగే గతజన్మలను చూసుకున్న తర్వాత చాలామంది ఇంకా బాధల్లో కూరుకుపోవడాన్ని కూడా గమనించాను. ఎందుకంటే వాళ్ళు చూసుకున్నవి - వేశ్య, దొంగ, హంతకుడు, మోసం చేసిన మొదలైన పాత్రలు కావడం. దీని వలన తప్పు చేసాననే భావన వారిలో ఇంకా బలపడి, గుర్తుకు వచ్చినప్పుడల్లా బాధ కలుగుతూనే ఉంటుంది.

అలాగే ఇతరుల ద్వారా నాకు తెలిసిన మరొక విషయం ఏమిటంటే, గతజన్మలో మనం ఎవరినైతే ఇబ్బంది పెట్టామో వారిని గుర్తించి వారిని క్షమాపణ అడిగి వారి దగ్గర బంధీ అయివున్న మన గతజన్మ పాత్రను తెచ్చుకుంటే ప్రస్తుత జన్మలో ఉన్న సమస్య తగ్గిపోతుందని. కాని ఇలా చేసిన కొందరికి తాత్కాలికంగా ఉపశమనం లభించినప్పటికీ, మళ్ళీ సమస్య తిరిగి వారి జీవితంలో రావడాన్ని గమనించాను.

ఇలా ఎందుకు జరుగుతోంది, దీనికి పరిష్కారం ఏమిటని నా లోపల ప్రశ్నించుకుంటే నాకు వచ్చిన మెసేజ్ ఏమిటంటే, కేవలం సమస్యకు సంబంధించిన గతజన్మలను మాత్రమే చూసుకుంటే సరిపోదు; ఆ జన్మలను తప్పు చేసాననే భావనతో కాకుండా దివ్యమైన భావనతో చూసినప్పుడే, సమస్యకు శాశ్వతమైన పరిష్కారం లభిస్తుందని వచ్చింది.

ఇక్కడ అర్థం చేసుకోవలసిన మరొక విషయం ఏమిటంటే - ఈ జన్మ సమస్యకు కారణం గతజన్మ పాపం. మరి గతజన్మలో పాపం ఎందుకు చేసాం అంటే అంతకు ముందు జన్మలో దానికి సంబంధించిన లింకు వుంటుంది. అంటే ఉదాహరణకు ఈ జన్మలో మోసపోయారనుకోండి, ఇలా ఎందుకు జరిగిందంటే మీరు గతజన్మలో మోసం చేయడం వలన. మరి గత జన్మలో మీరు ఎందుకు మోసం చేసారు, అంతకు ముందు జన్మలో మీరు మోసపోయారు కనుక. ఇక్కడ ఇద్దరిదీ తప్పే కనుక ఒక్క గతజన్మనే చూసుకుని తప్పుచేసాననే నిర్ణయానికి రావద్దు.

కాబట్టి సమస్యలు శాశ్వతంగా పరిష్కరింపబడాలంటే, ఈ ద్వంద్వాల ఆటను ఆడడం మానేయాలి. వ్యతిరేకమైన మంచి-చెడు పాత్రలను గతజన్మలలో ఎత్తేసారు, కనుక ఇప్పుడు వాటి మధ్య శత్రుత్వాన్ని కొనసాగించే మీ అలవాటును వదిలేసి, వాటి మధ్య మిత్రత్వాన్ని సృష్టించాలి. అనగా గతజన్మలకు సంబంధించిన అన్ని మంచి-చెడు పాత్రలను ఉన్నది ఉన్నట్టుగా అంగీకరించి, ప్రేమించి వాటిని దివ్యమైన భావనతో చూడగలగాలి. అంటే వాటి ద్వారానే తప్పు-ఒప్పులకు అతీతంగా ఉన్న దివ్యమైన చైతన్యపు స్థితికి మీరు చేరాలి. అంటే మీరు మంచి-చెడు రెండింటికి ప్రతినిధిగా వ్యవహరిస్తూ పరిస్థితిని బట్టి రెండింటినీ కలిపి ఉపయోగించుకుంటూ జీవితాన్ని ఆనందంగా గడపాలన్నమాట.

## ఆదర్శం

ఈ దివ్యమైన చైతన్యపు స్థితికి చేరాలంటే, ప్రస్తుత జన్మ ఆదర్శంగా తయారు కావాలి. అంటే ఇప్పుడు మీ జీవితంలో జరుగుతున్న ప్రతీ సంఘటనను దివ్యంగా చూడగలిగిన తర్వాతే వాటికి సంబంధించిన గతజన్మ పాత్రలు మీలో వచ్చి కలుస్తాయి. ఈ జన్మలో మిమ్మల్ని ఎవరైనా ఇబ్బంది పెట్టినా లేదా తప్పని పరిస్థితిలో మీరు ఇతరులను ఇబ్బంది పెట్టినా, వాటన్నింటినీ మీరు దివ్యంగా చూడగలిగినప్పుడే గతజన్మ పాత్రలు మీలో వచ్చి కలుస్తాయి. ఎందుకంటే అప్పుడే గతజన్మలలో అలా ఎందుకు జరిగిందో అర్థం చేసుకునే స్థితికి మీరు చేరుతారు. కావున మీరు ఇప్పుడు తప్పు-ఒప్పులకు అతీతంగా చేరడానికి అవసరమైన సాధనను చేయాలి. కాబట్టి మీ సమస్యలన్నింటికి మూలం, తప్పు-ఒప్పులకు సంబంధించిన చైతన్యపు స్థితిలోనే మీరు ఇరుక్కుపోయి ఉండడమే.

ఉదాహరణకు మీరు ఎవరినైనా మోసం చేసినా లేదా మిమ్మల్ని ఎవరైనా మోసం చేసినా, మోసం చేయడం లేదా మోసం చేయించుకోవడం రెండూ దివ్యమైన అనుభవాలుగా భావించి వాటి మధ్య మిత్రత్వాన్ని సృష్టించి వాటిని దివ్యంగా మీరు అనుభవించినప్పుడే, ఆ మోసానికి సంబంధించిన గతజన్మ పాత్రలు మీలో కలిసిపోతాయి అంటే స్వచ్ఛమైన పాత్రలుగా మారిపోతాయి. మిమ్మల్ని ఎవరైనా మోసం చేసినప్పుడు మీరు ఆ సమస్యకు ఆధీనమయ్యి, మీలోని దైవం వద్దకు చేరినప్పుడు, ఆ దైవం మీకు ఈ సృష్టి ఎక్కడ జరుగుతున్నదో మీకు అనుభవపూర్వకంగా చూపించి నేర్పిస్తాడు.

అది ఎలా అంటే... దైవం - "అరే, అందరూ వారి జీవితాలు వారి తలరాతల ప్రకారమే జరుగుతున్నాయని నమ్ముతున్నారు కదా. అది కరక్టే, కాబట్టి వాడి తలరాతలో మోసం చెయ్యాలి అని రాసి వుండాలి, నీ తలరాతలో మోసగించబడాలి అని రాసి ఉండాలి, కాబట్టి ఇక్కడ తప్పు వాడొక్కడిదే కాదు. నీ తలరాతలో ఉంది కాబట్టే వాడు నిన్ను మోసం చేయగలిగాడు. అందువలన నీ జీవితాన్ని నువ్వే

సృష్టించుకుంటున్నావు, కాబట్టి అతనిని పక్కన పెట్టి, నీ జీవితం యొక్క బాధ్యతను తీసుకుని, ఆ సమస్య యొక్క మూలం ఎక్కడ జరిగిందో తెలుసుకుని, దానిని ఉన్నది ఉన్నట్టుగా అంగీకరించి, ఆ తలరాతను మార్చి, అంటే ఈ సమస్య నుంచి బయటకు రావాలి అనే కొత్త ఎంపికను చేసుకుని, ఆ సమస్యకు సంబంధించిన మనోభావాలను క్లియర్ చేసుకున్నప్పుడు మీ సమస్యకు పరిష్కారం లభిస్తుంది అని మీకు అర్ధమయ్యేట్టుగా చెబుతాడు. ఈ జ్ఞానాన్ని ఆచరిస్తే ఫలితం లభిస్తుంది. ఈ అనుభవజ్ఞానం వచ్చిన తర్వాత మోసానికి సంబంధించిన కర్మలు దగ్ధం అవుతాయి, అంటే దానికి సంబంధించిన మంచి-చెడు రూపాలు దగ్ధమై స్వచ్ఛమైన పాత్రలుగా మారిపోతాయి.

మీరు మీ లోపల ఉన్న దైవానికి లేదా సమస్యకు ఆధీనమైనప్పుడే మీకు ఈ విద్య నేర్పిస్తాడు. ఇలా మీరు నేర్చుకుని ఫలితాలు సాధించినప్పుడు, సృష్టి అంతా నా లోపలే జరుగుతోందనే భావన మీలో స్థిరమవుతుంది. అప్పుడు మీరు తప్పని పరిస్థితిలో ఇతరులతోటి కఠినంగా ప్రవర్తించినా, ఒకప్పుడు మీకు వచ్చిన తప్పు చేసాననే భావన అంతరంలో మాయమైపోతూ, నాకు వర్తమానంలో ఏది అనిపిస్తే అది చేసాను, రాగ-ద్వేషాలకు అతీతంగా చేరిన తర్వాత, ఏది జరిగినా అది ఫర్ఫెక్ట్ అవుతుందనే భావన మీలో మేల్కొనడం మొదలౌతుంది. ఈ భావన మీలో స్థిరమైన తర్వాతనే మీరు పాప-పుణ్యాలకు, తప్పు-ఒప్పులకు అతీతంగా చేరుతారు.

కనుక పరిణితి చెందిన ఆత్మగా ప్రవర్తించాలి. మీ జీవితంలో ఏది జరిగినా దానికి ఇతరులను నిందించకుండా, నా జీవితానికి నేనే సృష్టికర్తను, నా తలరాత ప్రకారమే జరిగింది అని బాధ్యత వహించి, ఆ సమస్య ద్వారా దైవం దగ్గరకు చేరినప్పుడే తలరాతను కూడా చెరిపేయగలుగుతారు. నేనే సృష్టికర్తను అని భావించినప్పుడే, అవసరమైనంత సేపు ఆ సృష్టిని మీరు కొనసాగించవచ్చు, ఇక చాలు అని అనిపించినప్పుడు ఆ సృష్టిని లయం చేయవచ్చు. అంటే నా జీవితానికి నేనే బ్రహ్మను, విష్ణువును మరియు మహేశ్వరుడిని అని అనుభవంలో తెలుసుకోగలుగుతారు.

ఉత్తములు ఆత్మ విమర్శ చేసుకుని తనను తాను తీర్చి దిద్దు కుంటారు. అధములు మాత్రమే పరనింద చేస్తూ అధోగతి పాలౌతారు. కనుక మీరు సృష్టికర్తను అనే భావనలో లేకుంటే మీరనుకున్నవి సాధించలేరు. కనుక మీరనుకున్న ఫలితం రానప్పుడు, దానికి బాధ్యత వహించకుండా ఇతరులపై నిందమోపితే మీరెంత ప్రయత్నించినా మీ జీవితం మీ చేతిలోకి రాదు. ఆ అపజయాన్ని అర్ధం చేసుకుని దానిని విజయంగా పరివర్తన చెందించలేరు. బాధితుడిగానే జీవితాన్ని కొనసాగించాల్సి వస్తుంది, ఎందుకంటే

అప్పుడు మీరనుకున్న ప్రకారం కాకుండా తలరాత ప్రకారమే మీ జీవితం నడుస్తుంది. కనుక అన్నింటిని పరిగణలోకి తీసుకుని సరియైన నిర్ణయం తీసుకోండి.

అలాగే కొందరు నేను గతజన్మలో జ్ఞానిని, యోగిని అని తెలుసుకుని ఈ జన్మలో సాధన చేయడం మానేస్తున్నారు. మీరు గతజన్మలో ఎంత పెద్ద మాస్టరైనా ఈ జన్మ కంటే తక్కువే. ఎందుకంటే దైవం ఎప్పుడు తన లోపల దాగి ఉన్న కొత్త కొత్త సామర్ధ్యాలను కనుగొంటూ ఉంటాడు, కాబట్టి మీరు ఈ జన్మలో ఏమి సాధిస్తున్నారో దాని మీద దృష్టిని నిలపండి. నేనే దైవాన్ని అని అనుభవపూర్వకంగా తెలుసుకుంటూ ఎప్పుడు ఎదుగుతూ జ్ఞానాన్ని పెంచుకోండి.

## గతజన్మలను చూడడం:

గతజన్మల గురించి లోతుగా తెలుసుకోవాల్సిన అవసరంలేదు. ఎందుకంటే దీని వలన కొత్త సమస్యలు ఏర్పడే అవకాశం ఉంది. ఒకతను గతజన్మను చూసుకుని గందరగోళానికి లోనయ్యాడు. అతను గతజన్మలో రోమ్ అనే దేశంలో పుట్టాడట. అతని పేరు, అతని భార్య పేరు కూడా తెలుసుకున్నాడట. ఇంత వరకు బాగానే ఉంది, ఇప్పుడు నా భార్య ఎక్కడ ఉంది అని తెలుసుకోవాలని అనిపించిందట, అప్పుడు అతనికి తెలిసినది ఏమిటంటే గతజన్మలో భార్య ఈ జన్మలో చెల్లి అని. ఇది తెలుసుకుని షాక్ అయ్యి నాకు చెప్పాడు. అప్పుడు నేను అన్నాను ఏ జన్మది ఆ జన్మకే పరిమితం చెయ్యి, ఇంకొక జన్మలో కూడా అదే బంధాన్ని కొనసాగించాలని కోరుకోకు, ఆత్మవిద్య నేర్చుకున్నప్పుడే నీకు ఇవన్నీ అర్ధమవుతాయి. కాబట్టి గతజన్మలను లోతుగా తెలుసుకోకుండా, వాటికి సంబంధించిన మనోభావాలను క్లియర్ చేసుకో అని సలహా ఇచ్చాను.

తన మామగారు చనిపోయిన తర్వాత కోడలు గర్భవతి అయినప్పుడు ఇంట్లో అందరూ ఏమనుకుంటారు, చనిపోయిన మామగారు మళ్ళీ పుడుతున్నాడు అని. పుట్టిన తర్వాత ఆ తల్లి ఆ పిల్లవాడిని మామగారిగా భావించి, ఆ పిల్లవాడిని బట్టలు లేకుండా ఎలా చూడాలి, ఆ పిల్లవాడిని ఎలా ముద్దు పెట్టుకోవాలి అని దూరంగా ఉండడం సరి అయినది కాదు. ఎందుకంటే ఆ పిల్లవాడికి తల్లి ప్రేమ కరువౌతుంది. అందువలన ఏ జన్మది ఆ జన్మకే పరిమితం చెయ్యండి, అలాగే నేను పై ఉదాహరణలో చెప్పినట్టు చేస్తే మీరు గతజన్మల నుంచి సులభంగా బయటికి వస్తారు.

## గతజన్మలు అంటే ఏమిటి?

జీవాత్మ అయిన మీరు "నేను ఎవర్ని" అనే ప్రశ్నకు సమాధానం కనుక్కోవడానికి, నిరంతరం మీ గురించి మీరు తెలుసుకునే ప్రక్రియలో నిమగ్నమై ఉంటారు. ఈ వాంఛ వలనే, మీరు ఎన్నో జన్మలు ఎత్తారు. ద్వంద్వాల యొక్క లక్షణాలు మరియు గుణాలకు సంబంధించిన వివిధ రకాల పాత్రలను సృష్టించి వాటి ద్వారా ద్వంద్వాల పట్ల సంపూర్ణమైన అవగాహనను పొందుతూ వచ్చారు. ఈ ద్వంద్వ అనుభవాలనే మనం ఇప్పుడు గతజన్మ పాత్రలుగా పిలుస్తున్నాం.

నేను గతజన్మలలో ఏ ఏ పాత్రలను పోషించానని నాలోని దైవాన్ని అడిగినప్పుడు నాకు వచ్చిన మెసేజ్ ఏమిటంటే, ఎన్నో జన్మలను తీసుకున్నావు కనుక వాటన్నింటినీ వివరంగా చూడడం అసాధ్యం, అందువలన ఈ భూమి మీద నువ్వు చూస్తున్న అన్ని రకాల మంచి-చెడు పాత్రలను గత జన్మలలో ఎత్తేసానని భావించి అన్నింటిని కలుపుకో, అలాగే ప్రతీ ఆలోచన కూడా గతం లేదా గతజన్మల నుంచి వస్తున్నదని భావించు అని సందేశం వచ్చింది. అప్పటి నుంచి అదే భావనలో ఉంటూ సాధనను కొనసాగిస్తున్నాను.

ఇక్కడ కలుపుకోవడం అంటే మనం స్వచ్ఛమైన శక్తిని ఉపయోగించుకుని ఎన్నో పాత్రలను పోషించి ఎన్నో రూపాలను సృష్టించాము. ఇప్పుడు వీటిని సరిగ్గా అర్థం చేసుకుని, వీటిని దివ్యంగా అనుభవించి, వీటిని దివ్యమైనశక్తిగా లేదా స్వచ్ఛమైన శక్తిగా లేదా పరమానందంగా లేదా ఆత్మశక్తిగా పరివర్తన చేసిన తర్వాత, మళ్ళీ స్వచ్ఛమైన శక్తిలో తిరిగి కలపడం. ఎలా పరివర్తన చేయాలి అనే విషయం తెలుసుకోవడానికి అంతర్ ప్రయాణం, మార్గదర్శకుడు అనే టాపిక్‌లను చదవండి.

## మన ప్రస్తుత జన్మ యొక్క గొప్పతనం ఏమిటి?

ఈ ప్రస్తుత జన్మ, మీ గతజన్మల్లాంటి జన్మ కాదు. ఎందుకంటే ఈ జన్మ యొక్క లక్ష్యం ఏమిటంటే గతజన్మ పాత్రలను కలపడం, అలాగే ఆత్మను మరియు పరమాత్మను శరీరంలోకి ఆహ్వానించి దివ్యమానవుడిగా పరివర్తనం చెందడం. ఇలా అన్నింటినీ కలపడం యొక్క ముఖ్యోద్దేశ్యం ఏమిటంటే – మనకు నచ్చని భాగాలన్నింటిని చైతన్య మానసంలోకి రావడానికి అనుమతించి, నచ్చిన-నచ్చని వాటి మధ్య సమన్వయాన్ని మిత్రత్వాన్ని ఏర్పర్చి, మళ్ళీ ఏకం చేసి, నేనే దైవాన్ని అని అనుభవపూర్వకంగా తెలుసుకోవడమే. దీని అర్థం నేను ఎవరు అన్న ప్రశ్నకు సమాధానాన్ని పొందడమన్నమాట. వీటన్నింటి యొక్క సారాంశాన్ని తిరిగి దగ్గరకు చేర్చినప్పుడే, మనం సంపూర్ణత్వాన్ని పొందుతూ దివ్యమానవుడిగా పరివర్తన చెందుతాం. దీని వలన మనం ఎప్పటి నుంచో చేస్తున్న సుదీర్ఘ ప్రయాణం సంపూర్ణమవుతూ, మనం మరొక కొత్త ప్రపంచంలోకి ప్రవేశిస్తాం.

అందువలనే ఈ జన్మ చాలా ప్రత్యేకమైనది. కాని ఇది అందరికీ వర్తించదు. ఎవరైతే గత జన్మలలో ద్వంద్వాలలోని అన్ని గుణాల యొక్క అనుభవాలను పొంది, వాటన్నింటికి అతీతంగా ఉన్న గుణాతీత స్థితికి చేరడానికి సిద్ధంగా ఉన్నారో, అంటే ముక్తిని పొందడానికి అర్హతను సాధించారో వారికే ఇది వర్తిస్తుంది. కాబట్టి మీరు ఈ సాధన చేయడానికి అర్హుడినా కాదా అనేది మీ అంతరంలో అడిగి తెలుసుకోండి. అర్హత ఉన్న వాళ్ళే దీనిని చదివి ఆచరణ చేస్తారు అని నాకు ఉన్న అవగాహన ప్రకారం నేను చెప్పగలను.

## ఈ జన్మలన్నింటినీ ఎలా కలపాలి?

కేవలం మీరు చేయవలసినది ఏమిటంటే, మీరు ఎరుకలో ఉండి, ఒక్కొక్కటిగా గతజన్మ పాత్రలను మనసులోకి రమ్మని ప్రేమతో ఆహ్వానించాలి. ఇలా ఆహ్వానించి మీ ప్రేమలో మీరు మునిగిపోవాలి. అంటే మీ దగ్గర బాహ్యంగా మరియు అంతరంలో ఉన్న నచ్చిన, నచ్చని అన్నింటినీ ప్రేమించాలి ఇష్టపడాలి. అప్పుడే ఇవి వస్తాయి. అలాగే ప్రస్తుత జన్మలో జరిగిన అన్నింటినీ దివ్యంగా చూడగలిగినప్పుడే గతజన్మలన్నీ మీలో కలిసి పోతాయి.

కాని ఈ గతజన్మ పాత్రలు మన మీద కోపంతో ఉన్నాయి. ఎందుకంటే మనం ఒక కొత్త మార్గంలో పయనిస్తున్నప్పుడు, ఆ మార్గంలో ఎదురయ్యే పరిస్థితుల పట్ల మనకు ఏమాత్రం అవగాహన ఉండదు. దీని వలన మనం ఊహించని ఎన్నో పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది. అంటే మనకు తెలియని మార్గంలో నడుస్తున్నప్పుడు మన కాళ్ళకి ముళ్ళు గుచ్చుకుని గాయాలు ఏర్పడవచ్చు. ఆ విధంగానే గతజన్మలలో ఎన్నో అవమానాలను, కష్టాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. వీటి కారణంగా అంతరంలో కొన్ని తీవ్రమైన గాయాలు ఏర్పడ్డాయి.

ఇలా ఒక్కొక్క జన్మలో ఏర్పడిన ప్రతీ గాయాన్ని పట్టుకుని కూర్చోవడం వలన జీవాత్మ ముందుకు కొనసాగలేక పోతున్నానని గుర్తించింది. అంటే మరొక కొత్త జన్మను, కొత్త అనుభవాన్ని పొందలేకపోయింది. అందువలనే జీవాత్మ వీటిని కొంతకాలం పాటు దూరంగా నెట్టివేసింది. జీవాత్మ తన ప్రయాణం ముందుకు సాగడం కోసమే గతజన్మ పాత్రలను పట్టించుకోకుండా వదిలేసింది. వీటన్నింటిని తిరిగి మనలో కలపడానికి, లేదా ఆ జన్మలలో ఏర్పడిన గాయాలను హీల్ చెయ్యడానికి సరైన సమయం ఇదే. ఎందుకంటే మన ఈ ప్రస్తుత జన్మని దీని కోసమే ఎంచుకుని వచ్చాం కాబట్టి. అలాగే ఇప్పుడు భూమి మీద ఉన్న శక్తులు మరియు సమయం కూడా వీటికి అనువుగా ఉన్నాయి కాబట్టి.

ముఖ్యంగా ఈ జన్మకి ఆత్మతో ఒక ప్రత్యేకమైన సంబంధం ఉంది. ఈ బంధం వలన, అన్ని గతజన్మలను కలుపుతూ నేనే దైవమని తెలుసుకునే సంపూర్ణమైన అనుభవాన్ని పొందడం సాధ్యమవుతుంది. ఇదంతా నేను ఎవర్ని అన్న ప్రశ్నకు సంపూర్ణమైన సమాధానం పొందడం గురించే.

ఈ వదిలేసిన భాగాలన్నింటిని తిరిగి కలపడానికి ఇదే సరైన సమయం. ఇప్పుడివి మీ ప్రస్తుత వాస్తవానికి దగ్గరగా వస్తున్నాయి. ప్రస్తుతం మీకు వస్తున్న కలలన్నీ కూడా గతజన్మల యొక్క అనుభవాలకు సంబంధించిన జ్ఞాపకాలే. గతజన్మలను కలుపుకోవడానికి మీరు ఏ ప్రయత్నాలు చేయనక్కర్లేదు. మీరు కేవలం ధ్యానం చేస్తూ వాటిని రమ్మని ఆహ్వానిస్తే చాలు. ఎందుకంటే చాలా కాలం క్రితం నుంచి విడిపోయిన శక్తులన్నీ, మీ స్వచ్ఛమైన ప్రేమ కోసం, మీ అంగీకారం కోసం ఇప్పుడు మీ దగ్గరకు వస్తున్నాయి కాబట్టి.

ఈ పాత్రలన్నీ మీ మొహం మీద చిరునవ్వును చూడాలని, ప్రతీ పాత్ర దివ్యమైనదేనని తెలుసుకోవాలని, మీ పట్ల లేదా మీ ప్రతీ పాత్ర పట్ల మీ హృదయంలో ఏమాత్రం ద్వేషం లేదని తెలుసుకోవాలని, మీరు వాటిని తిరస్కారంతో కాకుండా, పూర్తి ప్రేమతో వాటిని విడుదల చేయాలని కోరుకుంటున్నాయి. ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే, మీరు వాటిని ఏ మాత్రం మార్చాలని చూడకుండా ఉన్నది ఉన్నట్టుగా అంగీకరించి వాటిని అర్థం చేసుకుని ప్రేమించినప్పుడు మాత్రమే మీరు వాటిని విడుదల చేయగలరు. సాధన చేస్తున్నప్పుడు మీరు ఈ విషయాన్ని స్పష్టంగా గుర్తిస్తారు.

కాని మీరు ఈ విధంగా నన్ను అడుగవచ్చు – "నా శరీరానికి, మనసుకి హీలింగ్ అవసరం కదా!" అని. కాని నిజానికి హీల్ కావలసినవి కేవలం ఎదగకుండా ఒకే రూపంలో ఇరుక్కుపోయి ఉన్న ఆ గతజన్మ పాత్రలలో ఉన్న శక్తి మాత్రమే. మీలో చలనం లేకుండా నిలిచిపోయిన శక్తి విడుదలవ్వాలని, దీవించబడాలని మరియు స్వేచ్ఛను లేదా పరిష్కారాన్ని పొందాలని కోరుకుంటోంది. అప్పుడే అది సరికొత్త పద్ధతిలో పయనిస్తూ మీకు సహాయం చేయగలదు.

ఉదాహరణకు మీకు కోపం పట్ల ద్వేషం ఉందనుకుందాం, ఎప్పుడైతే మీరు కోపాన్ని ప్రేమిస్తారో అది తను ఉన్న స్థితి నుంచి ఎదుగుతూ మీకు కోపం యొక్క ఉపయోగం అనుభవపూర్వకంగా తెలిపి మీకు దాని పట్ల దివ్యమైన భావన కలిగేలా చేస్తూ, అది దివ్యమైన శక్తిగా పరివర్తన చెందుతుంది. ఇలా కోపానికి సంబంధించిన గతజన్మపాత్ర దివ్యత్వంలోకి చేరిన తర్వాత మీ శరీరంలో ఎప్పటి నుంచో ఉన్న సమస్య మాయమైపోతుంది. అప్పుడు మీకు అర్థమౌతుంది సమస్యలకు పరిష్కారం గతజన్మ పాత్రలలో నిలిచిపోయివున్న శక్తులను విడుదల చేసి మీరు ఎదుగుతూ అవి ఎదగడానికి సహకరించడమేనని.

ఈ గతజన్మ పాత్రలు ఒక అభిప్రాయానికి వచ్చి దానికి ఫిక్స్ అయిపోయాయి. వీటిని విడుదల చెయ్యడమంటే, ఏ రూపంలో అయితే అది స్థంబించిపోయి ఉందో ఆ రూపాన్ని విడుదల చెయ్యడమే. అంటే గతజన్మలలో పడిన బాధలను, కష్టాలను విడుదల చెయ్యడం లాంటిదే. నిజానికి ఇక్కడ మీరు గతజన్మల ఉనికిని తిరస్కరించడం లేదు, కేవలం అది ఇరుక్కుపోయి ఉన్న భ్రమను మాత్రమే విడుదల చేస్తున్నారు.

ఉదాహరణకి గతజన్మలో క్యాన్సర్ ద్వారా చనిపోయారనుకోండి. అప్పుడు ఆ పాత్ర, క్యాన్సర్ వస్తే నన్ను తప్పకుండా చంపేస్తుంది అనే భ్రమలో ఉంటుంది. ఎప్పుడైతే ఈ ప్రస్తుత జన్మలో మీరు క్యాన్సర్ సహాయంతో దివ్యత్వం దగ్గరకి చేరవచ్చు మరియు ఆరోగ్య స్థితికి చేరవచ్చు అనే భావనను మార్చుకుని, దానికి సంబంధించిన పాత్రలను మీ చైతన్యంలోకి ఆహ్వానించి, వాటిని ఉన్నది ఉన్నట్టుగా అంగీకరించి, దివ్యత్వం వైపు పయనించు అని దానికి స్వేచ్ఛనిస్తూ, మీరు కూడా దివ్యత్వం వైపు పయనిస్తారో, అప్పుడు అది తన అభిప్రాయాన్ని మార్చుకుని తను ఎదుగుతూ క్యాన్సర్ ద్వారా దివ్యత్వంలోకి ప్రవేశించవచ్చు అని తెలుసుకుంటూ మీకు కూడా ఆ సమస్య ద్వారా అనుభవపూర్వకంగా అర్థమయ్యేలా తెలియజేస్తుంది. దీని వలన తిరిగి మీకు ఆరోగ్యం చేకూరుతుంది.

ఇక్కడ భ్రమ అంటే అది ఇంకా పరిణామం చెందవలసినది. అంటే అది అబద్ధమని అర్థం కాదు, అది నిజమే కాని ఆ ఒక్క రూపమే నిజం కాదు. అది పరిణామం చెందితే ఎన్నో కొత్త కొత్త నిజాలుగా రూపు దిద్దుకుంటుంది. అంటే నెగెటివ్ నుంచి పాజిటివ్‌కి, పాజిటివ్ నుంచి న్యూట్రల్‌కి, ఆ తర్వాత న్యూట్రల్ నుంచి డివైన్‌కి పరిణామం చెందుతుందన్న మాట.

నిజానికి మీరు ఎప్పటి నుంచో మోస్తున్న భారాలను, తప్పు చేశాననే భావనను లేదా మీ పట్ల మరియు ఈ సృష్టి పట్ల మీకున్న తప్పుడు అభిప్రాయాలను ఇప్పుడు మళ్ళీ ఒకసారి గమనించండి. వీటికి స్వేచ్ఛను ఇచ్చి మీ నుండి విడుదల చేయండి. అప్పుడు మీరు ద్వేషిస్తున్న విషయాల్లో దాగి ఉన్న బహుమతిని, రహస్యాన్ని స్పష్టంగా చూడగలరు. మీరు ఇప్పటివరకూ ద్వేషిస్తున్న భాగాలతో యుద్ధం చేయడం ఆపివేసినప్పుడే, అవి మీకు ఎవరనేది తెలియజేస్తాయి.

మీరు ఎప్పుడైతే పూర్తి ప్రేమ మరియు స్వేచ్ఛ కలిగిన ప్రదేశం నుంచి, అతికష్టమైన మరియు సాహసోపేతమైన విషయాలను చూస్తూ, వాటిలోని నిజాన్ని మరియు జ్ఞానాన్ని కనుగొంటారో అప్పుడే గతజన్మ పాత్రలు ఎదుగుతూ మీకు ఆనందాన్ని ఇస్తాయి.

## గతజన్మలని ఎలా ఆహ్వానించాలి?

నిజానికి గతజన్మలతో డీల్ చేయడం అనేది పిల్లలతో డీల్ చెయ్యడం లాంటిదే. ఎందుకంటే ఇవి పిల్లల్లాగే ప్రవర్తిస్తాయి. మీరు ఒక తల్లిగా లేదా తండ్రిగా, మీరు వాటిని తిరిగి మీలో కలవడానికి రమ్మని ఆహ్వానించండి. మీరు మీ ఇంటిని వీటి కోసం సిద్ధం చేసుకుంటూ - గాయపడిన, భయపడిన, అవమానాలకి గురైన గతజన్మ పాత్రలన్నీ తిరిగి రావడానికి అనుమతినివ్వండి. ఒక తల్లి స్కూల్ నుంచి తిరిగి వచ్చే బిడ్డ కోసం వాడికి కావలసినవన్నీ ఎలా అయితే సిద్ధం చేస్తుందో అదే మాదిరిగా. ఎందుకంటే ఆ పాత్రలు తిరిగి వచ్చేటప్పుడు, వాటితో పాటు వాటికి సంబంధించిన ఆలోచనలను, నమ్మకాలను, మనోభావాలను, మరియు అనుభూతులను కూడా తీసుకువస్తాయి కాబట్టి.

నిజానికి చాలావరకు గతజన్మ పాత్రలు మీ ప్రేమ పూర్వకమైన ఆహ్వానం గురించే ఎదురు చూస్తున్నాయి. నిజానికి ఇవి చాలా అలసిపోయాయి. ఇప్పుడవి విశ్రాంతిని కోరుకుంటున్నాయి. నిరాశకు, బాధలకు మరియు కష్టాలకు గురైన గతజన్మ పాత్రలు కోరుకుంటున్నది - కేవలం సురక్షితమైన, సౌకర్యవంతమైన మరియు అంగీకారభావనతో కూడిన ప్రదేశం గురించే. మీరు భయాన్ని, బాధను లేదా అలసటను అనుభూతి చెందుతున్నట్లయితే, అవన్నీ కూడా ఈ గతజన్మ పాత్రల నుంచి వస్తున్నవే. అప్పుడు మీరు చెయ్యవలసినది ఏమిటంటే, మీ పట్ల మీరు అంగీకారభావనతోను మరియు ప్రేమతోను ఉంటూ, వాటిని ఇంటికి తిరిగి రమ్మని ఆహ్వానిస్తూ ధ్యానం చేయండి.

## కొన్ని పాత్రలు మీలో ఎందుకు కలవడం లేదు?

కొన్ని గతజన్మలు మీపై మీకు ప్రేమ కలిగి ఉన్నా అవి మీతో కలవవు. అవి మీలో కలవకపోగా మిమ్మల్ని చాలా ఇబ్బంది పెడుతూ, మీలో నరకాన్ని సృష్టిస్తూ ఉంటాయి. కొన్ని గతజన్మ పాత్రలు గతంలో వాటిని దూరంగా నెట్టివేసారని మీపై కోపంతో ఉన్నాయి. ఎందుకంటే ఆ జన్మలలో అవి ఎదుర్కొన్న కష్టాలు మరియు బాధల నుంచి కాపాడమని, రక్షించమని దైవాన్ని వేడుకొన్నాయి. కాని వాటి ఆశలు, కోరికలు ఏవీ నెరవేరలేదు. అందువలన ఈ చేదు అనుభవాలు ఆ గతజన్మ పాత్రలలో కోపాన్ని సృష్టించాయి మరియు వాటిని వాటి సొంతంగా బ్రతకమని నెట్టివేసినట్టుగాను మరియు వదిలివేసినట్టుగాను అనుభూతి చెందాయి. ఆ జన్మలలో గతజన్మ పాత్రలు ఎంత ప్రార్థించినా ఏ విధమైన రక్షణ గాని, సహాయం గాని దైవం నుంచి లభించలేదు. అందువలన అవి ప్రతీ దానిని సందేహించడం మొదలుపెట్టాయి. కాబట్టి అవి ప్రస్తుతం మిమ్మల్నే దైవంగా భావించడానికి సిద్ధంగా లేవు.

మీ నుంచి ఆహ్వానం అంది, అవి మీ చైతన్యంలోకి తిరిగి వచ్చినప్పటికీ, అవి నిరంతరం మీతో పోట్లాడుతూ ఏ మాత్రం ఎదగకుండా మిమ్మల్ని పట్టి పీడిస్తూ, మీ శక్తిని హరిస్తూ మీ జీవితాన్ని చాలా

కష్టతరం చేస్తాయి. ఆ జన్మలో మీరు సహాయం చేయకపోవడం వలన అవి పడిన కష్టాలకు ప్రతీకారం ఇప్పుడు తీర్చుకుంటున్నాయి. అవి ఈ ప్రక్రియలో ఇంటికి తిరిగి వచ్చినా కూడా మీ జీవితాన్ని నరకం చేస్తున్నాయి. ఇవి ప్రేమపూర్వకమైన కౌగిలిని కోరుకోవడం లేదు. ఇవి మీకు డబ్బు, బంధాలు, అనారోగ్యం లేదా ఇతర విషయాలకు సంబంధించిన సమస్యలను సృష్టిస్తూ, మీ ఇంటిని నరకం చెయ్యాలని అనుకుంటున్నాయి.

కాని ఇవి కేవలం నిజమైన అధికారాన్ని గౌరవిస్తాయి. ఇవి జాలి లేదా కరుణ చూపే గొంతుకన్నా, కమాండింగ్‌గా మాట్లాడే మాటకు సమాధానమిస్తాయి. ఒక టీనెజర్ ఎలా అయితే సున్నితమైన మాటలకు కాకుండా, స్పష్టమైన మరియు బలమైన కారణాలకే లొంగుతాడో అదే విధంగా ఇవి కూడా కేవలం ఒక స్పష్టమైన మరియు అధికారంతో కూడిన మాటకు మాత్రమే లొంగుతాయి. ఈ గతజన్మలన్నవి మీ మనసులో మాటల రూపంలో కదలాడడం మొదలుపెట్టినప్పుడు, లేదా స్థంభించిపోయిన శక్తుల వలన మీ శరీరం నొప్పులకు గురవుతున్నప్పుడు, మీరు గుర్తించాల్సినది ఏమిటంటే - వీటన్నింటి నుంచి బయటకు వచ్చే సమయం ఇదేనని గుర్తిస్తూ ఇకపై ఇవేమి జరగడానికి వీలు లేదని మీరు వాటికి స్పష్టంగా చెప్పగలగాలి. కాని ఈ మాట అనేది మీ మూలం నుంచి, మీ దివ్యత్వపు శక్తి నుంచి రావాలి; లేదంటే ఇవి మిమ్మల్ని చూసి నవ్వుతాయి మరియు తిరగబడతాయి. ఇక్కడ పరోక్షంగా అవి మీ ఎదుగుదలకు సహాయం చేస్తున్నాయి. అంటే మీరు ఎదిగి దైవ స్థితికి చేరిన తర్వాతనే అవి మీ సూచనలను పాటిస్తాయి.

కాబట్టి మీరు ఒక్కొక్క పాత్రను ఒక్కొక్క రకంగా డీల్ చేయాలి, అన్నింటికీ ఒకే మందు పనికిరాదు. మెల్లిగా చెప్పడం, అంకితమవ్వడం, ప్రేమతోటి చెప్పడం, సరదాగా మాట్లాడటం, తిట్టడం, అరవడం, ఏడ్పించడం, శాసించడం, రెచ్చగొట్టడంలాంటి అస్త్రాలను ఉపయోగించినప్పుడే ఫలితాలు వస్తాయి. అప్పుడే మీకు వివిధ రకాల మాటల పట్ల దివ్యమైన భావన వస్తుంది.

మీరు ఇలాంటి గతజన్మ పాత్రలతో డీల్ చేయడానికి ప్రయత్నించి విఫలమైతే వెంటనే వాటిని డీల్ చేయడం ఆపేసి ముందు మీరు దైవం దగ్గరకు చేరాలని సంకల్పించి, దైవం దగ్గరకు చేరి, ఇలాంటి పాత్రలను ఎలా డీల్ చేయాలో నేర్పించమని అడగండి. మీరు మరియు దైవం కలిసిన తర్వాతే గతజన్మ పాత్రల ద్వారా ఏర్పడిన సమస్య మాయమవుతుంది. కాబట్టి సమస్యను ఒకసారి లేదా రెండుసార్లు మీకు ఉన్న జ్ఞానంతో ప్రయత్నించండి. ఫలితం రాకపోతే వెంటనే ఆ సమస్యను దైవానికి అర్పించి మీరు కూడా దైవం దగ్గరకు చేరండి. దీని గురించి వివరంగా తెలుసుకోవడానికి - కరిగిపోండి, అంకితం అనే టాపిక్‌లను చదవండి.

కాబట్టి ఒకే సమస్యను పట్టుకుని సంవత్సరాల తరబడి మీరే ఒంటరిగా మీకు ప్రస్తుతం ఉన్న జ్ఞానంతో పరిష్కరించాలని ప్రయత్నించకండి. ఇదే చాలా మంది మనుషులు చేస్తున్నది. నేను కూడా 2004 వరకు ఇదే చేసాను. ఇలా చెబితే మానవ ప్రయత్నం తప్పకుండా చేయాలి కదా అని చాలా మంది అంటున్నారు. ఇది సరియైనదే కాని నేను చెప్పేది ఏమిటంటే ప్రయత్నిస్తూనే సమయం వృధా చేయవద్దని. చచ్చేంతవరకు ప్రయత్నించ వద్దని. ఒకసారి లేదా రెండు సార్లు ప్రయత్నించండి, ఫలితం రాకపోతే దైవ సన్నిధికి చేరండి.

అవును, ప్రేమించడం మరియు అంగీకరించడం అనేవి ప్రతీ దానికి గొప్ప మార్గంగా ఉపయోగపడవచ్చు, కాని ఇతరులను ప్రేమించడం కంటే మిమ్మల్ని మీరు ప్రేమించుకోవడం మరియు అంగీకరించుకోవడం అనేది అన్నింటికంటే ముఖ్యమైనది. అంతేగాని మీకంటే గతజన్మ పాత్రలనే ఎక్కువగా ప్రేమించడం లేదా మీ జీవితాన్ని పట్టి పీడించడానికి మరియు అదుపు చేయడానికి గతజన్మలని అనుమతించడం, లేదా అవి ఎంత ఇబ్బంది పెడుతున్నా ఏమీ అనకుండా ఒక బాధితుడిలా అవి పెడుతున్న బాధలను అనుభవించడం అనేది ప్రేమించడం ఎంతమాత్రం కాదు.

అంటే ఉదాహరణకి ఎవరైనా మీ సహనాన్ని పరీక్షిస్తూ మిమ్మల్ని బాధ పెడుతున్నప్పుడు, వారితో ధైర్యంగా బయటకు పొమ్మని చెప్పడం లాంటిదే. ఇంకా చెప్పాలంటే మిమ్మల్ని మీరు ప్రేమించుకుంటూ 'ఇక చాలు' అని గతజన్మలతో చెబుతూ, నీకు సంబంధించిన అన్నింటిని తీసుకుపొమ్మని వాటిని కమాండ్ చెయ్యడం కూడా అనంతమైన ప్రేమలో ఒక ముఖ్యమైన భాగమే. కాబట్టి ఇక చాలు అని చెప్పడానికి భయపడకండి.

ఇక్కడ గమనించవలసిన మరొక విషయం ఏమిటంటే, ఇలాంటి గతజన్మ పాత్రలు పడిన బాధను అర్థం చేసుకునే స్థితిలో మీరు లేనప్పుడు, అలాగే మిమ్మల్ని కూడా ఆ పాత్రలు అర్థం చేసుకోలేనప్పుడే ఇక చాలు అని చెప్పాల్సిన పరిస్థితి వస్తుంది. అంటే ఇలాంటి తుచ్ఛమైన మోసం పాత్ర నుంచి నేనేంటి మెసేజ్ తీసుకోవడం అనే అహంకారంలో మీరు ఉండడం, అలాగే మోసం పాత్ర కూడా ప్రతీకార వాంఛతో మీ మీద కోపం అలాగే ఉంచుకుని తన గొప్పతనం గురించి మీకు సరిగా వివరించకపోవడమే ఈ అభిప్రాయ భేదాలకు కారణం. కాబట్టి దీనికి పరిష్కారం ఇద్దరూ ఒకరిని ఒకరు సంపూర్ణంగా అర్థం చేసుకునేంత వరకు తాత్కాలికంగా విడిపోయి ఒంటరిగా ఉండి ప్రయాణం కొనసాగించినప్పుడే, సరియైన సమయంలో మళ్ళీ ఇద్దరూ కలుస్తారు.

ఉదాహరణకు నేను ఆడిటర్‌గా ప్రాక్టీస్ చేసే ముందు నేను ఒక సీనియర్ ఆడిటర్ దగ్గర పని చేసాను. అతను నాకు కమీషన్ ఇస్తానంటే ఎన్నో కొత్త కేసులను అతనికి వచ్చేలా చేసాను. ఇలా చేసిన తర్వాత అతను నాకు ఇవ్వాల్సిన కమీషన్ ఇవ్వలేదు. అప్పుడు నాకు కోపం వచ్చి అన్నింటినీ ప్రేమతోటి కలుపుకోవాలని తెలిసినప్పటికీ, నేను అతను చేసిన దానిని అంగీకరించలేక అతని నుండి బయటకు వచ్చి అతనికి పోటీగా అదే ఏరియాలో నేను స్వంతంగా ప్రాక్టీస్ మొదలు పెట్టి చాలా మంది క్లైంట్‌లను ఆకర్షించ గలిగాను.

ఇలా నా ప్రాక్టీస్ బాగా నడుస్తున్నప్పుడు, నాకు ఒక రోజు నా లోపలి నుంచి ఒక ప్రశ్న వినపడింది. అరేయ్ నువ్వు ఎలా  ఆడిటర్  ప్రాక్టీస్‌లో విజయాలు సాధిస్తున్నావు అని? అప్పుడు నేను అన్నాను నా అంతట నేను సాధన చేసి నా దైవం సహాయంతో ఇదంతా చేయగలిగానని చెప్పాను. అప్పుడు నాలోపలి నుంచి వచ్చినది ఏమిటంటే, అవును కరక్టే నీ టాలెంట్ తోటే నువ్వు సాధించావు, కాని దీనికి పరోక్షంగా నీ సీనియర్ ఆడిటర్ కూడా సహాయం చేసాడు. ఎందుకంటే అతనే నిన్ను మోసం చేయకుంటే, నువ్వు ఇప్పటికి కూడా ఆయన దగ్గరే సార్ సార్ అనుకుంటూ పని చేసేవాడివి. కాబట్టి అతను అలా చేసినందుకు అతనికి నీ అంతరంలో కృతజ్ఞతలు చెప్పి, అలాంటి గతజన్మ పాత్రలను నీ లోపలికి ఆహ్వానించి కలుపుకొమ్మని సూచించింది.

ఇది విన్నాక నాకు కరక్టే అనిపించి ఎంతో ఆనందం కలిగింది. ఎందుకంటే ఆయన దగ్గర పని చేస్తున్న నా స్నేహితులు ఇప్పటికీ ఆయన దగ్గరే పని చేస్తున్నారు కాబట్టి. వెంటనే  అతని పట్ల, అలాగే నా లోపల ఆయనకు ప్రతి రూపంగా ఉన్న ఆయన లాంటి గతజన్మ పాత్రల పట్ల నాకు ప్రేమ కలిగింది. అలాగే నేను అజ్ఞానంతో ఆ పాత్రను ఛీ పొమ్మని గతంలో నేను ఉన్న స్థితిలో దూరం నెట్టేయడం కూడా పర్‌ఫెక్టే అని అనిపించింది. ఆ తర్వాత నా అంతర్వాణి సూచించినట్టు మోసానికి సంబంధించిన గతజన్మ పాత్రలను మళ్ళీ ఆహ్వానించి ఒకరినొకరం అర్థం చేసుకుని, కలిసి ఒకటైపోయాము.

అలాగే నేను ఇతరుల మీద అతిగా ఆధారపడ్డప్పుడల్లా, నువ్వు వచ్చి నేను ఎవరి మీదనైతే ఆధారపడుతున్నానో, వాడు నాకు మోసం చేసేలా చెయ్యి అని గతజన్మ పాత్రలను వేడుకున్నాను. అలాగే తాను ఒకటి తలిస్తే దైవం ఇంకొకటి తలవడం కూడా ఫర్‌ఫెక్టే అని కూడా అనిపించింది. ఎందుకంటే దైవం మరోలా తలవకుంటే నేను ఎదిగేవాడిని కాదు. అందువలన మై డియర్ దైవం! నేను ఇలా బాహ్య దృష్టిలో ఉంటూ మాయలో ఇరుక్కు పోయినప్పుడల్లా నువ్వు అంతర్వాణి ద్వారా మెసేజ్ ఇచ్చి ఆదేశించు. అయినా కూడా నేను వినకుంటే ఏదో రూపంలో వచ్చి సమస్య సృష్టించు అని వేడుకున్నాను. ఎందుకంటే ఆ

సమస్యకు పరిష్కారం బాహ్యంగా ఎక్కడ దొరకదు. అప్పుడే నేను అంతర్ముఖుడనై ఆ సమస్యను గురువుగా భావించి దాని నుండి జ్ఞానం పొంది నేను నా దైవం వైపు ప్రయాణించి దైవం దగ్గరకు చేరుతాను.

అందువలన గతజన్మ పాత్రలతో ఇక చాలు నాలోంచి వెళ్ళిపోండి అని చెప్పడమంటే, వాటిపై దృష్టి పెట్టడం ఆపేస్తూ మీ అసలు లక్ష్యమైన మీ దైవం వైపు మీరు ప్రయాణించడమే. వాటికి సహజంగా మీపై ప్రేమ పుట్టినప్పుడే వచ్చి కలవమని చెప్పండి, అవి కలవకున్నా మీకు వచ్చే నష్టం ఏమీ లేదు. మీరు వాటి కోసం ఎదురుచూడకుండా మీ దైవం వైపు మీరు ప్రయాణించండి. ఇలా మీరు ప్రయాణిస్తూ దారిలో ఎదురు వస్తున్న గతజన్మ పాత్రలలో వేటిని ప్రేమతో కలుపుకోగలరో వాటిని కలుపుకుంటూ ముందుకు సాగండి. ఇలా మీరు అన్నింటిని దివ్యమైన భావనతో చూడగలగాలి అనే తపనతో ప్రయాణం చేస్తే, కోపంతో ఉన్న పాత్రలన్నీ మీరు చేస్తున్న సాధనకు ముగ్ధులై మీలో వచ్చి కలిసిపోతాయి. ఇక్కడ కలవడం అనేది, ఒకరి అనుభవాలను ఇంకొకరు ప్రేమతోటి పంచుకుంటూ, ఇరువురూ ఒకరినొకరు సంపూర్ణంగా అర్థం చేసుకున్నప్పుడే సాధ్యమవుతుందని గ్రహించండి.

ఇలా జన్మలన్నింటిని కలపడంలో విజయం సాధిస్తే మీకు కలిగే లాభం ఏమిటంటే: మీతో మీరు ప్రశాంతంగా ఉంటారు, మీ మనసు కూడా ప్రశాంతంగా ఉంటుంది, అంతటా నేనే ఉన్నాను - నాలోనే అంతా ఉంది అనే భావన మీలో స్థిరం అవుతుంది, అన్నింట్లో దైవాన్ని చూస్తారు, ద్వంద్వాలకు సంబంధించిన జన్మ పరంపరను ముగించుకుని న్యూ ఎనర్జీ ప్రపంచంలోకి ప్రవేశిస్తారు, అలాగే ఇవన్నీ తిరిగి వచ్చి కలిసినప్పుడు మీరు వర్ణించలేని పరమానందాన్ని కూడా అనుభవిస్తారు.

కాబట్టి ఆఖరికి నాకు ఉన్న అనుభవం ప్రకారం నేను చెప్పదలుచుకున్నది ఏమిటంటే, గతజన్మ పాత్రలను కలిపి, కర్మసిద్ధాంతానికి అతీతంగా చేరి, మీ ఆత్మను మరియు మీ పరమాత్మను మీ జీవితంలోకి ఆహ్వానించి, మీ భాగాలన్నింటి కలయికలో మీరు ఎల్లప్పుడూ హాయిగా ఉంటూ ముక్తిని పొందమని సలహా ఇస్తున్నాను.

**విరాళాలు**

ఈ న్యూ ఎనర్జీ కాన్సెప్ట్‌ను ఆచరించి లబ్ధి పొందినవాళ్ళు, మరెవరైనా విరాళాలు ఇవ్వదల్చుకుంటే, ఈక్రింద చెప్పిన బ్యాంక్ ఎకౌంట్‌లో డబ్బులు వేయగలరు. మీ సహాయం న్యూ ఎనర్జీ జ్ఞానాన్ని చాలామందికి పంచడంలో మాకు ఉత్తేజాన్ని, ప్రోత్సాహాన్ని అందిస్తుంది. A/C Detalis: P.Sreedhar, SBI A/C No: 30603897922, Branch: Hanumakonda, IFSC Code: SBIN0003422. Mobile No: 9390151912. This number also has GooglePay and PhonePe.